క్లుప్తంగా

అవకతవకలపై విచారణకు డిమాండ్

ధన్వాడ: మండలంలోని చర్లపల్లిలో ఆసరా పింఛన్ల పంపిణీలో మరణించిన వ్యక్తుల పేర్లపై డబ్బులు కాజేస్తున్న పంచాయతీ కార్యదర్శిపై విచారణ జరిపించాలని బహుజన సమాజ్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మొగులయ్య డిమాండ్ చేశారు. బుధవారం గ్రామంలోని పింఛన్‌దారులతో కలిసి మాట్లాడారు. మరణించిన వ్యక్తుల పేర్లపై పింఛన్ డ్రా చేస్తూ ప్రభుత్వ సొమ్మును కాజేస్తున్నారని ఆరోపించారు. సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయురాలి ప్రతిభ



మరికల్: సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని సికింద్రబాద్‌లో జీవిత చరిత్రపై నిర్వహించిన పోటీల్లో మరికల్ మండల మహిళా ఉపాధ్యాయులు ప్రతిభ కనబర్చారు. హెచ్‌ఎం అనూరాధ జిల్లా స్థాయి ప్రథమ బహుమతి గెలుపొందారు. నిర్వాహకులు ఆమెను అభినందించి రూ.7వేల నగదు, ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

ఓటమి భయంతోనే ఫోన్ హ్యాకింగ్

మరికల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బీఎస్పీ భయం పట్టుకుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ అన్నారు. మరికల్‌లో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సామాజికవర్గానికి చెందిన ఓట్లు చీలితే ఓటమి ఖాయమనే ఉద్దేశంతోనే ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఫోన్ హ్యాకింగ్ చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ లిక్కర్ స్కామ్‌పై విచరణ జరిపించకుండా ఇతర పార్టీల నాయకులపై గురిపెట్టడం న్యాయం కాదన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య, చంద్రకాంత్, అశోక్, బాల్‌చందర్, శ్రీను, రమేష్, కృష్ణ పాల్గొన్నారు.

శరణఘోష ఆల్బమ్ ఆవిష్కరణ



నారాయణపేట టౌన్: శబరిపీఠం సన్నిదానం గురుస్వాములు కాకర్ల భీమయ్య, జంగిటి వెంకటేష్, బట్టి తిప్పన్న ఆధ్వర్యంలో రూపొందించిన అయ్యప్ప స్వామి 108 శరణఘోష నామాలను ఎస్పీ బాలు అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి ఆలపించారు. బుధవారం పట్టణంలో ఏడీకే శ్రీకాంత్ స్టూడియోలో ఆల్బమ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గురుస్వాములు మాట్లాడుతూ అయ్యప్ప మాలాధరణ చేసే స్వాములు శరణఘోష ముఖ్యమని అన్నారు.


6న స్కీం వర్కర్ల నిరసన



నారాయణపేట టౌన్: ఈ నెల 6వ తేదీన అన్ని మండల కేంద్రాల్లో స్కీం వర్కర్ల నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, జిల్లా కన్వీనర్ బాల్‌రాం పేర్కొన్నారు. బుధవారం జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో డాక్టర్ రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వాల స్కీంలను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగ, కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో ఆశా కార్యకర్తలు నిరసన కార్యక్రమాలు చేపట్టి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కృష్ణాలో రైళ్లు నిలపాలని వినతి

కృష్ణా: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలని కోరుతూ సికింద్రబాద్ రైల్వే డివిజినల్ మేనేజర్ శరత్‌చంద్రన్‌కు కృష్ణా మండలానికి చెందిన అఖిలపక్ష నాయకులు విజ్ఞప్తి చేశారు. బుధవారం కృష్ణా, కాజీగూడ నూతన రైల్వేలైన్ పరిశీలించేందుకు కృష్ణాస్టేషన్‌కు రావడంతో నాయకులు ఆయనను కలిసి లిఖిత పూర్వకంగా విజ్ఞప్తి చేశారు. కరోనాకు ముందు ఈ స్టేషన్‌లో 8 ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపేవారని, ప్రస్తుతం నిలపకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధ మహదేవ్, బీజేపీ నాయకుడు అమర్‌కుమార్ దీక్షిత్, కిష్టప్ప, నాగరాజ్ కులకర్ణి, నారాయణభట్ పాల్గొన్నారు.



షెడ్లకు మోక్షమెప్పుడో..?



కోస్గిలో వీధి వ్యాపారం చేసుకుంటున్న వ్యాపారులు

- మున్సిపాలిటీల్లో రోడ్లపైనే కొనసాగుతున్న వ్యాపారాలు
- జిల్లాలో 3,765 మంది వీధి వ్యాపారుల గుర్తింపు

కోస్గి: మున్సిపాలిటీల పరిధిలో రోడ్లపై వ్యాపారం చేసుకుని జీవనోపాధి పొందుతున్న వీధి వ్యాపారులకు తాత్కాలిక షెడ్లు నిర్మించి తోడ్పాటు అందిస్తామని చెప్పిన ప్రభుత్వాలు ఏళ్లు గడుస్తున్నా షెడ్ల నిర్మాణ విషయంలో ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. దీంతో జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలో రోడ్లపైనే వ్యాపారాలు కొనసాగిస్తూ వీధి వ్యాపారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీధి వ్యాపారుల బాగోగులను పర్యవేక్షించే మెప్మా అధికారులు కేవలం రుణాలిచ్చే వరకే పరిమితం కావడంతో షెడ్ల నిర్మాణ విషయం పట్టించుకునేవారు లేరు.

జిల్లాలో వీధి వ్యాపారుల వివరాలు..	
మున్సిపాలిటీ	వీధి వ్యాపారులు
నారాయణపేట	2,051
కోస్గి	820
మక్తల్	894
మొత్తం	3,765

తీర్మాణాలకే పరిమితం..

మున్సిపాలిటీల పరిధిలోని ప్రధాన రహదారులే దిక్కవడంతో వ్యాపారులు దుకాణా, కాంప్లెక్స్‌ల ఎదుట వ్యాపారం చేసుకునేందుకు లక్షల్లో అడ్వాన్సులు, నెలనెలా వేలల్లో అద్దెలు చెల్లిస్తున్నారు. అద్దెలు చెల్లించే స్థాయి లేని కొందరు ప్రభుత్వ స్థలాల్లో తోపుడు బండ్లు, చిన్న దుకాణాలు వేసుకొని ప్రధాన రోడ్లే పెద్ద దిక్కుగా వ్యాపారం కొనసాగిస్తున్నారు. రూ.కోట్ల బడ్జెట్ ఉన్న మున్సిపాలిటీల్లో వీధి వ్యాపారుల షెడ్ల నిర్మాణ అంశం తీర్మాణాలకే పరిమితం కావడంతో వ్యాపారులకు రహదారులే దిక్కాయ్యాయి.

రుణాలతోనే సరి..

వీధి వ్యాపారం నమ్ముకొని జీవనోపాధి పొందుతున్న వ్యాపారులకు ఆర్థిక చేయుతనిచ్చి ఆదుకునేందుకు ప్రభుత్వం ఆత్మ నిర్భర్ పథకంలో భాగంగా స్వల్పకాలిక రుణాలిచ్చి కొంతమేర ఆసరగా నిలుస్తుంది. మున్సిపాలిటీల పరిధిలో వీధి వ్యాపారం చేసుకుని జీవనం సాగించే చిరు వ్యాపారులను గుర్తించి ఎలాంటి పూచికత్తు లేకుండా బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడంతో చిరు వ్యాపారులకు బయటి నుంచి వడ్డీ వ్యాపారులను ఆశ్రయించకుండా కొంత రక్షణగా మారింది.

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం..



కొన్నేళ్లుగా రోడ్ల వెంట తోపుడు బండిపై పండ్లు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నా. వీధి వ్యాపారం చేసుకునే వారికి తాత్కలిక షెడ్లు నిర్మించి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో మూడేళ్లుగా ఎదురుచూస్తున్నా. షెడ్ల నిర్మాణం ప్రకటనలకే పరిమితమైంది. రోడ్లపై పండ్ల వ్యాపారం చేయాలంటే ఇబ్బందిగా మారింది.

– జహంగీర్, వీధి వ్యాపారి, కోస్గి

చేయూతనివ్వాలి..



వీధి వ్యాపారులకు షెడ్లు నిర్మించి ఇస్తామని చెప్పి సంవత్సరాలు గడిచినా ఎలాంటి పురోగతి లేదు. షెడ్ల నిర్మాణంలో రోడ్లపై వ్యాపారాలతో ఏర్పడే ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడంతో పాటు వీధి వ్యాపారులకు షెడ్ల నిర్మాణ పనులు చేపట్టాలి.

– గోవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్, కోస్గి

నివేదిక అందించాం..

వీధి వ్యాపారులకు సంబంధించి షెడ్ల నిర్మాణ విషయమై అనువుగా ఉన్న స్థలాలు గుర్తించి సమగ్ర వివరాలతో ఉన్నతాధికారులకు నివేదిక అందించాం. షెడ్ల నిర్మాణ విషయంలో తదుపరి ఆదేశాలు రావాల్సి ఉంది. ప్రస్తుతానికి ఆత్మ నిర్భర్ పథకం కింద ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తుంది.

– కృష్ణమాచారి, మెప్మా పీడీ, నారాయణపేట

సీఎస్‌సీ కేంద్ర నిర్వాహకుడి చేతివాటం

ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తి గ్రామంలో ఈకేవైసీ నమోదు కోసం వచ్చిన రైతు వేలిముద్రతో రూ.10వేలు పెద్దజట్రం గ్రామానికి చెందిన సీఎస్‌సీ కేంద్రం నిర్వాహకుడు కాజేశాడు. ఈ సంఘటన బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. నిడుగుర్తి గ్రామంలో ఈకేవైసీ చేయని రైతుల కోసం పెద్దజట్రం గ్రామానికి చెందిన సీఎస్‌సి కేంద్రం నిర్వాహకుడిని వ్యవసాయ అధికారులు రైతువేదిక వద్దకు రప్పించారు. పలువురు రైతులు ఈకేవైసీని వేలిముద్ర వేసి నమోదు చేసుకున్నారు. అదేవిధంగా నిడుగుర్తి గ్రామానికి చెందిన రైతు తెలుగు కిష్టయ్య ఈకేవైసీ చేయించుకునేందుకు రైతువేదిక వద్దకు వెళ్లాడు. సీఎస్‌సీ నిర్వాహకుడు రమేష్ రైతు వేలిముద్ర సహాయంతో ఈకేవైసీ చేయడంతోపాటు రైతు ఖాతా నుంచి 10వేలు డ్రా చేసుకున్నాడు. అనుమానం వచ్చిన రైతు ఊట్కూరు గ్రామానికి వెళ్లి హెచ్‌బీఐ బ్యాంక్‌లో ఖాతాను పరిశీలించుకున్నాడు. ఈకేవైసీ చేయించే సమయంలో 10వేలు ఖాతా నుంచి డ్రా చేసుకున్నట్లు బ్యాంక్ సిబ్బంది తెలిపారు. దీంతో రైతు గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో పలువురు రైతులు వెళ్లి సీఎస్‌సీ నిర్వాహకుడిని నిలదీయడంతో 10వేలు రైతుకు ఇచ్చేందుకు అంగీకరించాడు. అమాయక రైతులను మోసం చేసేందుకు చూసిన సీఎస్‌సీ నిర్వాహకుడిపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ఎర్రమట్టి తరలిస్తే చర్యలు

మరికల్: మండలంలోని మాధవరం ప్రభుత్వ భూముల్లో ఎర్రమట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రాంకోటి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాధవరం శివారులోని ప్రభుత్వభూమి గుట్టలను తవ్వి రాత్రి సమయంలో జేసీబీతో టిప్పర్లకు నింపి అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. అధికారుల హెచ్చరికాలను భేఖాతర్ చేసి అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నారాయణపేట రూరల్: సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుండటంతో సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. జిల్లాలోని వివిధ విద్యాసంస్థల్లో, బస్టాండ్‌లోని ప్రయాణికులు, రోడ్లపై వాహనదారులు, ఉపాధి సిబ్బందితో బుధవారం మాట్లాడి అవగాహన కల్పించారు. అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని వారికి ఫోన్ ఇవ్వడం చేయరాదన్నారు. అనవసరమైన లింకులు మొబైల్‌కు వస్తే ఓపెన్ చేయరాదని, లాటరీ తగిలిందని, తక్కువ ధరలకు ఆన్‌లైన్‌లో వస్తువులు అమ్ముతున్నట్లు ప్రకటనలు చూసి మోసపోవద్దన్నారు. అనుమానం వస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 193కు గాని డయల్ 100, 112లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని వారు సూచించారు.



ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పాఠాలు సులువుగా అర్థమవుతాయి



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు

ధన్వాడ: ప్రభుత్వ పాఠశాలలో టీచింగ్ లర్నింగ్ మెటీరియల్ ప్రదర్శనతో విద్యార్థులకు పాఠాలు సులువుగా అర్థం అవుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆవరణలో మండల స్థాయి ఎఫ్‌ఎల్‌ఎన్–టీఎల్‌ఎం కార్యక్రమని నిర్వహించారు. ఇందులో మండలంలోని 90 మంది ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని మండలస్థాయి ఎఫ్‌ఎల్‌ఎన్–టీఎల్‌ఎం మేళా ప్రదర్శనల నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ గోవిందరాజులు ఉపాధ్యాయులు చేసిన వాటిని తిలకించారు. తొలిమెట్టు కార్యక్రమంలోని ఎఫ్‌ఎల్‌ఎన్–టీఎల్‌ఎం ముగింపు కార్యక్రమంలో సీఐ శ్రీకాంత్ పాల్గొని మాట్లాడారు. ఈటీఎల్‌ఎం వల్ల విద్యార్థులకు పాఠాలు సులువుగా అర్థం అవుతాయని అన్నారు.

టీఎల్‌ఎంలో ఉపాధ్యాయుల ప్రతిభ

టీచింగ్ లర్నింగ్ మెటీరియల్ (టీఎల్‌ఎం) మండలస్థాయి మేళాలో ప్రాథమిక స్థాయిలో 1నుంచి 5వ తరగతి వరకు చెందిన మొత్తం 90 ఉపాధ్యాయులు చేసిన వాటిని ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. విషయాల వారీగా ప్రథమ, ద్వితీయ బహుమతులు, ప్రశంసపత్రాలు అందించారు. మొత్తం 18మంది ఉపాధ్యాయులు మొదటి బహుమతులు గెలుపొందారు. వీరు జిల్లాస్థాయిలో ప్రదర్శనలు ఇవ్వనున్నారు.

సులభ పద్ధతిలో విద్యాబోధన చేయాలి



కోస్గిలో బహుమతులు అందజేస్తున్న ఏఎంఓ విద్యాసాగర్ తదితరులు

- డీఈఓ గోవిందరాజులు

నర్వ: విద్యార్థులకు బోధనభ్యాస ప్రక్రియల ద్వారా ఉత్తమమైన, సులభమైన బోధన చేపట్టాలని డీఈఓ గోవిందరాజులు అన్నారు. బుధవారం మండలంలోని పాథర్చేడ్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన మండల స్థాయి తొలిమెట్టు టీఎల్‌ఎం మేళాను ఆయన ప్రారంభించారు. అనంతరం మండలంలోని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తయారు చేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను ఏర్పాటు చేసిన ప్రత్యే స్టాల్స్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మీనారాయణ, ఎంపీపీ జయరాములుశెట్టి, కిరణ్‌ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, ఎంపీటీసీ శ్యాంలాల్, నోడల్ అధికారి రాజేష్ పాల్గొన్నారు.

కోస్గి: తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధనోపకరణాలు వినియోగిస్తూ చదువు చెప్పడం ద్వారా విద్యార్థులకు పాఠాలు పూర్తిస్థాయిలో అర్థం కావడంతో పాటు విద్యాబోధన సులభంగా ఉంటుందని ఏఎంఓ విద్యాసాగర్ అన్నారు. పట్టణంలోని ఏబీకే ఫంక్షన్ హాల్‌లో కోస్గి, గుండుమాల్ మండలాలకు కలిపి మండల స్థాయి కృత్యామేళా (టీఎల్‌ఎం) ఏర్పాటు చేశారు. ఈ మేళాను ఎంపీపీ మధుకర్‌రావు ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్, ఎంఈఓ అంజలీదేవి, ఎంపీపీ మధుకర్ రావు, జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి పాల్గొన్నారు.

మాగనూర్: విద్యార్థుల్లో కనీస అభ్యాసన సామర్థ్యాలను పెంచడం కోసం ప్రభుత్వం తొలిమెట్టు కార్యక్రమం చేపట్టిందని సర్పంచ్ రాజు, జెడ్పీటీసీ వెంకటయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మీనారాయణ, ఎంపీపీ శ్యామలమ్మ, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, నోడల్ అధికారి వెంకటయ్య, క్లస్టర్ నోడల్ అధికారి నర్సిములు పాల్గొన్నారు.



మాగనూరులో మేళాను పరిశీలిస్తున్న అధికారులు



కృష్ణాలో మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మీనారాయణ

కృష్ణా: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండల స్థాయి టీఎల్‌ఎం మేళా నిర్వహించినట్లు ఎంఈఓ లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం రాజేశ్వర్, నిజాముద్దీన్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

టీపీయూఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీసీసీబీ చైర్మన్ నిజాంపాష

ధన్వాడ: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో బుధవారం కాంప్లెక్స్ హెచ్‌సెం రమేష్ శెట్టి, కొండాపూర్ కాంప్లెక్స్ హెచ్‌సెం లక్ష్మీ ఆధ్వర్యంలో టీపీయూఎస్ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి డా.మల్లిఖార్జున్ మాట్లాడుతూ మెరుగైన విద్యాబోధన అందించాలన్నారు. కార్యక్రమంలో కనకప్ప, సురేష్‌కుమార్, శేఖర్‌గౌడ్, శంకర్, రాములు, భాను, శివ, ప్రసాద్, రవివర్మ తదితరులు పాల్గొన్నారు

మక్తల్: పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి బుధవారం ఆయన నివాసంలో విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి యాదగిరి, జనార్దన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఎంఈఓ లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లప్ప, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీపీయూఎస్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

మనీ క్యాలెండర్..

మక్తల్ మండలం సంగంబండకు చెందిన సామాజిక సేవా కార్యకర్త ఎల్ఎల్ గాంధీ రూపొందిందించిన మనీ క్యాలెండర్‌ను కలెక్టర్ కోయశ్రీ హర్ష, డీసీసీబీ చైర్మన్ నిజాంపాష గురువారం ఆవిష్కరించారు.

విద్యార్థులపై ఒత్తిడి తగ్గించండి



మాట్లాడుతున్న డీపీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యచంద్ర

మక్తల్: పదో తరగతి విద్యార్థులకు పరీక్షల కోసం ఎస్‌సీఈఆర్‌టీ జారీ చేసిన ప్రత్యేక తరగతుల షెడ్యూల్‌ను వెంటనే సవరించాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యచంద్ర అన్నారు. బుధవారం మక్తల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాయంత్రం 5:30గంటలకు పదో తరగతి తరగతులు ముగించాలని, 2వ శనివారం, ఆదివారాల్లో ఉపాధ్యాయులు పని చేయాలనడం సరికాదని అన్నారు. విద్యార్థులకు ఆదనపు తరగతులను తీసుకుంటే గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు హైమవతి, ఉపాధ్యాయులు పరందరాములు, స్పందన, వై.చంద్రశేఖర్, సృజన తదితరులు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తత అవసరం

ఊట్కూరు: అపరిచిత వ్యక్తుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రాములు కోరారు. బుధవారం బాలికల ఉన్నత పాఠశాలలో పోలీస్ కళాజాత ఆధ్వర్యంలో వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మోసూరిత మాటలు నమ్మి ఎలాంటి వస్తువులను తీసుకోరాదని అన్నారు. అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. పిల్లలు పనులకు వెళ్లకుండా బడికి వెళ్లాలని కోరారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు యువకులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. అతిగా సెల్‌ఫోన్ వినియోగించడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రకాష్‌రెడ్డి, అజమ్మ, హెచ్‌ఎం స్పందన, కళాబృందం సభ్యులు శ్రీదేవి, సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న తదితరులు పాల్గొన్నారు.



ఊట్కూరులో మాట్లాడుతున్న ఎస్ఐ రాములు

కృష్ణా: సైబర్ నేరాలపై మండల కేంద్రంలోని ప్రజలకు బుధవారం స్థానిక ఎస్ఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెల్‌ఫోన్ మూలంగా రోడ్డు ప్రమాదాలపై వివరించారు.

పేదలకు అండగా ‘కల్యాణలక్ష్మి’



చెక్కు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

మాగనూర్: పేదలకు అండగా సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి అందిస్తున్నారని జెడ్పీటీసీ వెంకటయ్య అన్నారు. బుధవారం ఎంపీపీ శ్యామలమ్మ ఆధ్వర్యంలో మండలంలోని లబ్ధిదారులకు మంజూరైన నాలుగు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో పల్లెలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లతో పేదల కష్టాలు తొలగుతున్నాయని గుర్తుచేశారు. ఇప్పటికే దేశంలోనే పథకాల అమలులో తెలంగాణ ప్రభుత్వం అగ్రగామిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ అమీర్, ఎంపీటీసీ ఎల్లారెడ్డి, హన్మంతు, రికార్డు అసిస్టెంట్ ఫర్వీద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్: పట్టణలంలో తెలంగాణ రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో షాట్‌పుట్, పరుగు పందెం, లాంగ్ జంప్, షార్ట్‌పుట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బుధవారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలం, సీఐ సీతయ్య, అధ్యక్షుడు సత్య ఆంజనేయులు, రూప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బోర్డు పరిశీలన..

స్థానిక బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేయనున్న ‘లవ్ మక్తల్’ లైటింగ్ బోర్డును ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. సంక్రాంతి పండుగ వరకు బోర్డు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, ఏఈ శివనాగు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.